క్లుప్తంగా

భీమిలి జెడ్సీగా కనక మహాలక్ష్మి బాధ్యతల స్వీకరణ

భీమునిపట్నం: భీమిలి జోనల్ కమిషనర్‌గా కె.కనకమహాలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. పది రోజుల క్రితం రాజమండ్రి నుంచి బదిలీపై వచ్చిన శైలజవల్లి ఇక్కడ జెడ్సీగా బాధ్యతలు చేపట్టగా ఆమెను ప్రస్తుతం మధురవాడకు బదిలీ చేశారు. ఇటీవల మధురవాడ నుంచి నగరంలోని జీవీఎంసీ కార్యాలయ పీవోగా బదిలీపై వెళ్లిన కనకమహాలక్ష్మిని భీమిలికి బదిలీ చేశారు. కాగా కేవలం పది రోజుల్లోనే జెడ్సీ శైలజవల్లిని ఇక్కడి నుంచి బదిలీ చేశారు.

వైఎస్సార్ హయాంలోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి

తగరపువలస : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే ఉత్తరాంధ్రలో అభివృద్ధి జరిగిందని సీనియర్ నాయకుడు కొయ్య ప్రసాదరెడ్డి అన్నారు. భీమిలి మండలం తాళ్లవలసలో అడ్డాల వెంకట వర్మరాజు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కాంగ్రెస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైద్య కళాశాలలు, విశ్వవిద్యాలయాలు ఆయన హయాంలోనే నిర్మించారన్నారు. అప్పట్లో స్టీల్ ప్లాంట్‌ను ఎన్డీఏతో కలిపి టీడీపీ విక్రయించడాన్ని వైఎస్ రాజశేఖరెడ్డి అడ్డుకున్నారన్నారు. సంక్షేమం పుట్టిందే ఆయన హయాంలో అని గుర్తు చేశారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు గొంప గోవందరాజు, ఉపాధ్యక్షుడు తలారి సురేష్, సాయికుమార్, పుక్కళ్ల రాజు, గౌతమ్, ఆర్.మధుసూధన్, కేశవమూర్తి, గంధవరపు రమణ పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలని ఆందోళన

భీమునిపట్నం: తమ డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్ల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆర్డీవో కార్యాలయం ముందు ఆందోళన చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు, బకాయిలు విడుదల చేయాలని, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ముఖ్య సభ్యులు ఎం.లోవరాజు, కె.సాయిబాబా, ఎం.ముత్యాలరావు, ఎం.ఆనందరావు, టి.భీమారావు, అప్పలరాజు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

లిప్ అమలు తీరు పరిశీలన

పద్మనాభం : మండలంలోని రెండు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఎంఈవో పి.రమణతో కూడిన ఏడుగురు సభ్యుల బృందం సందర్శించి అభ్యసనాభివృద్ధి (లిప్) కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. మద్ది, పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను వారు పరిశీలించారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు ఏవిధంగా బోధిస్తున్నారు, ఇటీవల నిర్వహించిన పరీక్షల మార్కుల రికార్డులను పరిశీలించారు.

ఆలయాల భూముల కౌలుకు వేలం నేడు

పద్మనాభం : మండలంలోని అనంతవరంలోని రెండు ఆలయాల భూముల్లో ఫలసాయం అనుభవించుటకు కౌలు శిస్తు నిర్ణయానికి శుక్రవారం వేలం పాట నిర్వహించనున్నట్టు ఈవో నానాజీబాబు ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణేశ్వర స్వామి, శ్రీరామ మందిరానికి చెందిన భూమిలో ఫలసాయం అనుభవించుటకు కౌలు శిస్తు నిర్ణయానికి వేలం నిర్వహించనున్నట్టు తెలిపారు. 2024 ఏప్రిల్ ఒకటి నుంచి 2027 మార్చి 31 వరకు ఈ భూముల్లో ఫలసాయం అనుభవించుటకు అనంతవరం గ్రామ సచివాయం వద్ద వేలం పాట ప్రారంభించనున్నట్టు నానాజీబాబు తెలిపారు. హెచ్చు పాటదారుడు మొదటి ఏడాదికి సంబంధించి శిస్తు చెల్లించాలని తెలిపారు.

ఘనంగా సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజతో పాటు అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలంతా సీఎం జగన్ పక్షమే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- కార్యకర్తలే వైఎస్సార్ సీపీకి రక్ష
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పీఎం పాలెం: రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని, ఆయనకు మద్దతుగా ప్రజలు నిలవాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పీఎం పాలెంలోని అవంతి ఫంక్షన్ హాలులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులందరికీ తలుపుతట్టి అందజేసిన సీఎం జగన్ పక్షాన అత్యధిక ప్రజానీకం ఉన్నారన్నారు. ఈ వాస్తవాన్ని పచ్చ పత్రికలు, ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు. చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు ఎన్ని కుయుక్తులు పన్నినా 2024 ఎన్నికల్లో సీఎం జగన్ మరోమారు ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. భీమిలి నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్ సీపీ విజయమే ధ్యేయంగా పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఆయన కోరారు. సీఎం జగన్ మానస పుత్రికలైన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలపై పచ్చ పత్రికలు నిత్యం బురదజల్లుతున్నాయన్నారు. ఈ విధానం మార్చుకోకపోతే ప్రజలే గట్టిగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పోతిన హనుమంతరావు, బొట్ట అప్పలరాజు, కృష్ణ మూర్తి పాత్రుడు, పోలి రెడ్డి, గోపి, కె.వరలక్ష్మి, పోతిన యల్లాజీ, ప్రసాద్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ థీమ్ పార్కు సిద్ధం


ప్రారంభానికి సిద్ధమైన స్పోర్ట్స్ థీమ్ పార్కు

- బక్కన్నపాలెంలో రూ.1.95 కోట్లతో ముస్తాబు
- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ : సుందరంగా ముస్తాబవుతోన్న పార్కులతో పచ్చదనం నిండిన నందనవనంలా మధురవాడ ప్రాంతం తయారవుతోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కొలువుదీరిన నాలుగున్నరేళ్లలో అరడజనుకు పైగా భారీ పార్కులు భీమిలి నియోజకవర్గం పరిధిలోని మధురవాడ జోన్‌లో సిద్ధమయ్యాయి. ఇటీవల స్వతంత్రనగర్‌లో ఓ పార్కు, యోగా, మెడిటేషన్ థీమ్ పార్కు ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం బక్కన్నపాలెం సాయిప్రియ గార్డెన్ మాస్టర్ ప్లాన్ రోడ్డుకు చేరువలో స్పోర్ట్స్ థీమ్ పార్కు సిద్ధమైంది. అన్ని వసతులు, ఇండోర్ ఆటలకు అవసరమైన కోర్టులతో రూ.1.95 కోట్ల వ్యయంతో స్పోర్ట్స్ థీమ్ పార్కు అత్యంత సుందరంగా ముస్తాబు చేశారు. ఇక్కడి గోడలకు సుందరంగా, ఆకట్టుకునేలా క్రీడలకు సంబంధించిన పెయింటింగ్స్, క్రికెట్ ప్రాక్టీస్ నెట్, షటిల్, బ్యాడ్మింటన్, త్రో బాల్ కోర్టులతోపాటు పిల్లలకు ఆట సామగ్రి, కూర్చునేందుకు బెంచీలు, పచ్చదనంతో నిండిన ల్యాన్, మరుగుదొడ్లు, ఇతర వసతులు కల్పించారు. అన్ని వసతులు, హంగులతో అత్యంత సుందరంగా ముస్తాబైన పార్కును ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం సాయంత్రం ప్రారంభించనున్నట్టు ఏఈ సురేష్ చెప్పారు. కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంకతో పాటు పలువురు ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్టు తెలిపారు.


పార్కులో ఏర్పాటు చేసిన ఓ కళాకండం


థీమ్ పార్కులో సిద్ధమైన కోర్టులు

జగనన్న కాలనీ ఇళ్ల రిజిస్ట్రేషన్లు వేగవంతం


కణమాంలో జగనన్న కాలనీ ఇళ్ల రిజిస్ట్రేషన్ కోసం సచివాలయానికి వచ్చిన లబ్ధిదారులు

ఆనందపురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు జరుపుతున్న నవరత్నాలు సంక్షేమ పథకాల్లో భాగంగా మంజూరు చేసిన వైఎస్సార్ జగనన్న కాలనీ ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మంజూరు చేసిన కాలనీ ఇళ్లను ఆయా సచివాలయాల్లో లబ్ధిదారుల పేరుతో రిజిస్ట్రేషన్ చేసి డాక్యుమెంట్లను అప్పగించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శికి రిజిస్ట్రార్ అధికారాలను అప్పగించారు. ప్రభుత్వ ప్రతినిధులుగా ఆయా వీఆర్వోలు వ్యవహరిస్తున్నారు. ఆనందపురం మండలంలోని 26 పంచాయతీల పరిధిలో 18 సచివాలయాలు ఉన్నాయి. వివిధ గ్రామాల్లో గల పేదలకు 3,651 జగనన్న కాలనీలను మంజూరు చేశారు. ఇంత వరకూ 2,303 మంది లబ్ధిదారుల పేరున కాలనీ ఇళ్లు రిజిస్ట్రేషన్ చేసి అప్పగించారు. మిగతా వాటిని త్వరితగతిన పూర్తి చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారునికి కాలనీ ఇల్లు రిజిస్ట్రేషన్ చేసి అప్పగించడానికి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

రాంబాబుకు అభినందనలు


పతకం అందుకుంటున్న రాంబాబు

పద్మనాభం : పూణే మాస్టర్ అథ్లటిక్ అసోసియేషన్ అధ్వర్యంలో పూణేలో జరుగుతున్న 44వ నేషనల్ మాస్టర్ అథ్లటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్ర ప్రదేశ్ తరపున పాల్గొన్న కె.రాంబాబుకు రెండు పతకాలు రావడంతో పలువురు అభినందించారు. పద్మనాభం మండలం అనంతవరం గ్రామానికి చెందిన రాంబాబు సింహాచలం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్నాడు. పోటీల్లో 400 మీటర్ల రన్నింగ్‌లో సిల్వర్, 100 మీటర్ల రిలే రన్నింగ్ పోటీల్లో కాంస్య పతకాలు లభించాయి

వైఎస్సార్ సీపీతోనే భీమిలిలో అభివృద్ధి


సంతపేట రెడ్డివీధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న జీవీఎంసీ 2వ వార్డు ఇన్‌చార్జి సరళారాణి, తదితరులు

తగరపువలస : వైఎస్సార్‌సీపీతోనే భీమిలిలో అభివృద్ధి సాధ్యమైందని ఆ పార్టీ రెండో వార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి అన్నారు. సంతపేటలో రూ.18 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ హయాంలో గుంతలు పడిన రోడ్లను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభివృద్ధి చేస్తున్నారన్నారు. జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతున్న భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు నిత్య సేవకుడని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్.కరుణాకరరెడ్డి, చేట్ల ఎల్లయ్యరెడ్డి, నందిక శ్రీను, చిల్ల సూర్యనారాయణరెడ్డి, చిల్ల బాబయ్యరెడ్డి, శిల్ల వంశీరెడ్డి, చిల్ల ప్రమీల, జగన్నాథ ఎల్లాజీ, చేట్ల శ్రీనివాసరెడ్డి, జీరు పద్మ, కంచుబోయిన వెంకటరావు, చేట్ల నరసింగ్‌రెడ్డి, మద్ది మహాలక్ష్మి చిల్ల గణేష్‌రెడ్డి, సరగడ నాగిరెడ్డి, వాసుపల్లి నరేంద్ర, చేట్ల అప్పల సూరమ్మ, ఉప్పాడ అప్పలరెడ్డి, చేట్ల త్రినాథరెడ్డి, బొట్ట రమణ, నమ్మి భాస్కర్, చేట్ల పైడి ఎల్లాజీ, సరగడ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీపీ వాసురాజు, తదితరులు

తగరపువలస : భీమిలి మండలం దాకమర్రి జెడ్పీ హైస్కూల్‌లో గురువారం ఎంపీపీ దంతులూరి వాసురాజు పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేశారు. గత నెలలో ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులతో మాట్లాడగా... జీవశాస్త్రం, గణితం కష్టంగా ఉందని తెలిపారు. దీంతో ఎంపీపీ వాసురాజు ఆ సబ్జెక్టుల్లో నిష్ణాతులైన తన స్నేహితుడు జగన్ మోహన్‌నాయుడు సాయంతో గురువారం రెండు గంటలపాటు జీవశాస్త్రాన్ని బోధించి విద్యార్థుల సందేహాలు నివృత్తి చేశారు. వారం రోజుల వ్యవధిలో గణితం, జీవశాస్త్రంలో పాఠ్యాంశాలు బోధించే ఏర్పాటు చేయనున్నట్టు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

'రవాణా, పారిశ్రామిక బంద్ జయప్రదం చేయండి'


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ సహాయక కార్యదర్శి రాంబాబు

తగరపువలస : కేంద్ర ప్రభుత్వం రవాణా కార్మికులకు వ్యతిరేకంగా చేపడుతున్న దుర్మార్గపు చర్యలను నిరసిస్తూ ఆల్ ఇండియా జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టనున్న రవాణా, పారిశ్రామిక బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ వామపక్షాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు గుజ్జు రామునాయుడు భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి కానూరి రాంబాబు మాట్లాడారు. డ్రైవర్లను పదేళ్ల జైలులో పెట్టడం, రూ.లక్ష జరిమానా పేరుతో భయభ్రాంతులకు గురి చేయడం దారుణమన్నారు. మరోవైపు కొత్త చట్టాల ద్వారా కార్మికులను ఇబ్బందులపాలు చేస్తున్నారన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ పారిశ్రామిక సమ్మె, రవాణా బంద్‌కు పిలుపునిచ్చామన్నారు. రవాణా కార్మికులు స్వచ్ఛందంగా ఇందులో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మోర అప్పలరాజు, రవ్వ నరసింగరావు, చెల్లూరి అప్పారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

'తెలగా' కులస్తులను బీసీ జాబితాలో చేర్చాలి


మధురవాడలో పీవీఆర్‌కు హారతి పడుతున్న మహిళలు

మధురవాడ : ఉత్తరాంధ్ర తెలగ నాయకుడు, బీసీ రిజర్వేషన్ సాధన ఉద్యమ నేత పల్లంటి వెంకట రామారావు (పీవీఆర్) పాదయాత్రకు మధురవాడలో ఘన స్వాగతం లభించింది. మధురవాడలో మహిళలు హారతులతో స్వాగతం పలకగా, నాయకులు పూలమాలలు వేసి కోలాటం, డప్పులు, వాయిద్యాలతో సాదరంగా ఆహ్వానించారు. తెలగా కులస్తులను బీసీ జాబితాలో చేర్చాలనే తమ డిమాండ్‌ను అన్ని పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని పీవీఆర్ డిమాండ్ చేశారు. ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట వరకు సాగే యాత్ర గురువారం సాయంత్రం మారికవలస, కొమ్మాది, మధురవాడ, కార్‌షెడ్ మీదుగా నగరం వైపు సాగింది. యాత్రలో ఎస్.నరసింహమూర్తి, బావిశెట్టి సత్యనారాయణ, అల్లాడ ఉమా మహేశ్వరరావు, శంకాబత్తుల సతీష్, మానం శ్రీను, మానం వెంకటరావు, అల్లాడ లింగేశ్వరరావు, అల్లాడ ఎర్రిబాబు, శంకాబత్తులు రమేష్ పాల్గొన్నారు.

ఆత్మగౌరవ యాత్రకు పలువురి మద్దతు

ఆనందపురం : తెలగాల బీసీ రిజర్వేషన్ సాధన కోసం ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట వరకూ పల్లంట్ల వెంకటరామారావు చేపట్టిన ఆత్మగౌరవ యాత్రకు పలువురు నాయకులు మద్దతు తెలిపారు. ఆత్మగౌరవ యాత్ర గురువారం మండలంలోని పెద్దిపాలెం గ్రామానికి చేరింది. ఈ సందర్భంగా వెంకట రామరావు మాట్లాడుతూ తమ డిమాండ్ న్యాయ సమ్మతంగా ఉండడంతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఫోన్‌లో సంఘీభావం తెలిపారని, వైఎస్సార్ సీపీ భీమిలి ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, జనసేన భీమిలి ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ మద్దతు తెలిపారన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ విభాగాల్లో నియామకం



తగరపువలస: వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ విభాగాల్లో పలువురిని నియమిస్తూ తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. అందులో భీమిలి నియోజకవర్గానికి చెందిన పలువురికి పదవులు లభించాయి.

- బీసీ కమిటీ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా వాసుపల్లి కొండబాబు, ప్రధాన కార్యదర్శిగా చందక సూరిబాబు, కార్యదర్శిగా పాసి రామునాయుడు, సహాయ కార్యదర్శులుగా కోంద్రోతు శ్రీనివాస్, గొలగాని సూరప్పడు నియమితులయ్యారు.
- యువజన విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా బింగి హరికిరణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఇల్లపు వెంకటరావు, కార్యదర్శులుగా రాయన సాయికుమార్, సీర సూరప్పడు, సహాయ కార్యదర్శులుగా బార అప్పలనాయుడు, పాసి వినోద్‌కుమార్ నియమితులయ్యారు.
- మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా డబ్బీరు ప్రశాంతి, కార్యదర్శులుగా కాకర్లపూడి శ్రీదేవి, బోర సుజాత, సహాయ కార్యదర్శులుగా కాళ్ల అప్పలరాజు, మీసాల పైడిరాజు నియమితులయ్యారు.
- క్రిస్టియన్ మైనారిటీ సెల్ వైస్ ప్రెసిడెంట్‌గా దున్న అబ్రహం, ప్రధాన కార్యదర్శిగా మారోజు వినోద్‌బాబు, కార్యదర్శులుగా పేట ఆశాజ్యోతి, వై.క్రాంతికుమార్, సహాయ కార్యదర్శులుగా ఎన్.రవికుమార్, బొట్టా డేవిడ్ నియమితులయ్యారు.
- ఐటీ విభాగ కమిటీలో ప్రధాన కార్యదర్శిగా పిల్లా సూరిబాబు, కార్యదర్శులుగా కాళ్ల దుర్గారావు, ఉప్పాడ మోహన శివప్రసాద్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా డెక్కతి రమణ, పిల్లా త్రినాథ్ నియమితులయ్యారు.
- ముస్లిం మైనారిటీ విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా ముస్తఫా మార్పతియా, ప్రధాన కార్యదర్శిగా షేక్ షౌకత్ ఆలీ, కార్యదర్శులుగా షేక్ మస్తాన్, మహమ్మద్ హసీం రజ్వీ, సహాయ కార్యదర్శులుగా మహమ్మద్ ఖ్వాజా హుస్సేన్ మోహనుద్దీన్, ఎం.ముర్తాజ్, మహమ్మద్ గాలీబ్, అస్లామ్‌ఖాన్ నియమితులయ్యారు.
- పంచాయతీరాజ్ విభాగం కమిటీ అధ్యక్షునిగా లెంక రాంబాబు, వైస్ ప్రెసిడెంట్‌గా కొల్లి కోటిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మరగడ అప్పారావు, కార్యదర్శులుగా అవనాపు బంగారునాయుడు, ఉప్పాడ సూరిబాబు, సహాయ కార్యదర్శులుగా జిన్నల వెంకటరమణ, ఇల్లిపిల్లి చిన్నపాత్రుడు నియమితులయ్యారు.
- రైతు విభాగం జిల్లా అధ్యక్షునిగా మొకర అప్పలనాయుడు (అన్నమయ్య), వైస్ ప్రెసిడెంట్‌గా బలిరెడ్డి మహేష్, ప్రధాన కార్యదర్శిగా బంకసూర్యనారాయణ, కార్యదర్శులుగా బమ్మిడి అప్పలనాయుడు, సుంకరి పైడన్న, సహాయ కార్యదర్శులుగా జగన్నాథ అప్పారావు, కనకల వెంకటరమణ నియమితులయ్యారు.
- ఎస్సీ సెల్ ప్రధాన కార్యర్శిగా జీవీ రమణ, కార్యదర్శులుగా కొత్తపల్లి సూర్యనారాయణ, చెన్నా సత్యం, సహాయ కార్యదర్శులుగా వంకర అప్పారావు, బెల్లాన ప్రసాద్ నియమితులయ్యారు.
- ఎస్టీ సెల్ అధ్యక్షునిగా పేంద్ర అప్పన్న, ప్రధాన కార్యదర్శిగా గీతల దేముడు, కార్యదర్శులుగా గీతల ప్రకాష్, వరపుల త్రినాథ్, సహాయ కార్యదర్శులుగా కందర్సి అప్పలరాజు, కుందేలు మహేష్, కూంద్ర పైడిలత నియమితులయ్యారు.
- విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షునిగా నమ్మి లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శిగా ఎ.ఇల్లిపిల్లి వెంకటవరమ్మ, కార్యదర్శులుగా జి.భారతి, మేరుగు హరీష్, సహాయ కార్యదర్శులుగా కె.కార్తీక్, మజ్జి శ్రీనివాస్ నియమితులయ్యారు.
- చేనేత విభాగం ప్రధాన కార్యదర్శిగా తెడ్లాపు అప్పలరాజు, కార్యదర్శులుగా గిడుతూరి మురళి, గిడుతూరి నూకరాజు, సహాయ కార్యదర్శులుగా గిడుతూరి పూర్ణచంద్రరావు, తెడ్లాపు వినోద్ నియమితులయ్యారు.

అగ్ని ప్రమాదంలో నీలగిరి తోట దగ్ధం


కాలిపోయిన నీలగిరి తోట

ఆనందపురం : మండలంలోని కుసులువాడ పంచాయతీ చిన్నయ్యపాలెం వద్ద గల నీలగిరి తోట గురువారం అగ్నికి ఆహుతయింది. స్థానికంగా గల బంటుబిల్లి అప్పలనాయుడు అనే రైతు సుమారు 6 ఎకరాల్లో నీలగిరి తోట పెంచుతున్నాడు. గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు కాల్చిన సిగరెట్ ఆ తోటలో పడేయడంతో నిప్పు అంటుకుని మంటలు చెలరేగాయి. దీంతో సుమారు మూడు ఎకరాల నీలగిరి తోట అగ్నికి ఆహుతయింది. అగ్ని ప్రమాద విషయం తెలుసుకొని స్థానికులు మంటలు అదుపు చేయడానికి ప్రయత్నించినా నిలువరించలేకపోయారు. తాళ్లవలస అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో ఎస్ఐ శ్రీనివాసరాజు, సిబ్బంది అగ్నిమాపక శకటంతో సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం మరింత పెద్దది కాకుండా చర్యలు తీసుకున్నారు. ఈ ప్రమాదంతో రైతుకు సుమారు లక్ష రూపాయల వరకూ నష్టం వాటిల్లింది.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస : చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ బొట్టా రవి తెలిపారు. ఈ అంతరాయం కారణంగా తగరపువలస మెయిన్‌రోడ్డు, బాలాజీనగర్, కొండపేట, బంగ్లా మెట్ట, బాసర లే అవుట్, జ్యూట్‌మిల్లు రోడ్డు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో మధురవాడ విద్యుత్ సబ్ స్టేషన్ రేవళ్లపాలెం, 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్న కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని మధురవాడ సబ్ స్టేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్‌వీఎస్ రామమూర్తి చెప్పారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు చంద్రంపాలెం(మధురవాడ) హైస్కూల్, రేవళ్లపాలెం విలేజ్, రేవళ్లపాలెం రోడ్డులోని పీఎం పాలెం పోలీస్ స్టేషన్ ఏరియా, ఉజ్వల హాస్పిటల్, భాస్కర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. వినియోగదారులు, ప్రజలు గమనించి సహకరించాలని రామమూర్తి కోరారు.

ఆనందపురం : మండలంలోని పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని స్థానిక సబ్ స్టేషన్ ఏఈఈ సురేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. శొంఠ్యాం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపట్టనున్న దృష్ట్యా కణమాం, అయ్యవారి కణమాం, గొల్లల కణమాం, యాత కణమాం, గోరింట, ఎర్రవాని పాలెం, కోలవానిపాలెం, భీమన్నదొరపాలెం, రామవరం తదితర గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని సురేష్ కుమార్ కోరారు.

పీఎం పాలెం: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి 11 కేవీ పీఎం పాలెం ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకూ నిర్వహణ పనులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని జోన్ – 3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ప్రకటించిన సమయంలో విజేత సూపర్ మార్కెట్ ఏరియా, ఏపీహెచ్‌బీ కాలనీ, గాయత్రినగర్ కాలనీకి విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

కొత్తమ్మతల్లి హుండీ ఆదాయం రూ.3.42 లక్షలు

తగరపువలస : సంగివలస కొత్తమ్మ ఆలయ హుండీలను గురువారం లెక్కించగా రూ.3,42,940 ఆదాయం వచ్చినట్టు ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. ఈ ఆదాయం జనవరి 10 నుంచి ఈ నెల 15 వరకు వచ్చిందన్నారు. ఏసీ కార్యాలయం సూపరింటెండెంట్ కె.గోవింద్ ఇన్‌స్పెక్టర్‌గా వ్యవహరించారు. నగరానికి చెందిన శ్రీహరి సేవా సమితి సభ్యులు హుండీ ఆదాయం లెక్కింపులో పాల్గొనగా ఆలయ సిబ్బంది కోరాడ శ్రీను తదితరులు సహకరించారు.